క్లుప్తంగా

ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో అధికారులు

తుని రూరల్: ఎన్‌సీసీ శిక్షణకు 20 మంది విద్యార్థులు ఎంపికైనట్టు మండలంలోని హంసవరం ఏపీ మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కాకినాడ 18 (ఎ) సుబేదార్ మహేంద్ర కుమార్, హవల్దార్ గోవింద్ ఆధ్వర్యంలో ఎనిమిది, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఎంపికలు నిర్వహించామన్నారు. ఎన్‌సీసీ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు సాధించే విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. రెండు సంవత్సరాలు శిక్షణ పూర్తి చేసిన క్యాడెట్లకు ఏ సర్టిఫికెట్ లభిస్తుందన్నారు. ఎన్‌సీసీ ఏఎన్‌ఓ ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



పెద్దిపాలెంలో సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం సచివాలయ ఉద్యోగులు గణేష్, మూర్తి, రవి, జాను, ఇశ్రాయిల్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సచివాయంలో సన్మాన సభ నిర్వహించారు. బదిలీ అయిన ఉద్యోగులను గ్రామస్తులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, వీఆర్వో సత్యనారాయణ, గ్రామ పెద్దలు కుండల అప్పారావు, లొండ బాబు, రీసు సత్యనారాయణ, గైపూరి శ్రీను, లొండా వెంకటేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



రాచపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీను

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో రూ.7 లక్షలతో నిర్మించే రెండు సీసీ రోడ్లకు శుక్రవారం వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శ్రీను మాట్లాడుతూ ఎంపీటీసీ నిధులతో రహదారి నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రూ.1.50 కోట్లతో 42 రెండు సీసీ రోడుశ్ నిర్మించారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సారిపల్లి గంగరాజు, పెద్దిరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి నానిబాబు, దేశెట్టి చిన్న, ఒమ్మి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం



రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం: గ్రామంలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పామాయిల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ఆయిల్ పామ్ సాగు చేసే నియోజకవర్గాల్లో జగ్గంపేట ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇక్కడి రైతులకు ఆయిల్ పామ్ సాగులో అనుభవం ఉందన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుతో మంచి ఆదాయం పొందాలని ఆకాంక్షించారు. గోకవరం విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ గాజింగం సత్తిబాబు, జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్‌బాబు, దాసరి తమన్నదొర తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సాగర్‌ను ఆధునీకరించాలి

ప్రత్తిపాడు: మండలంలో ప్రధాన జలాశయమైన చంద్రబాబు సాగర్ (కట్టుచింతల ప్రాజెక్టు)ను అధునీకరించాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కోరారు. ఈ మేరకు శుక్రవారం కాకినాడలో మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజును కలసి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు నిర్మించి రెండు దశాబ్దాలు గడుస్తున్నా కాలువల ఆధునీకరణ లేకపోవడంతో ఐదు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదన్నారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కృషితో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుందన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకువచ్చి, రైతుల భూములకు సాగునీరు అందించాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- ఏలేశ్వరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముద్రగడ గిరిబాబు



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పట్టణంలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తాను అండగా ఉంటానన్నారు. ప్రతికార్యకర్తకు వెన్నంటి ఉండి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పార్టీ శ్రేణులు నేరుగా తనతోనే మాట్లాడవచ్చని, మధ్యవర్తులతో పనిలేదన్నారు. పార్టీ, తమ కుటుంబాన్ని నమ్ముకున్న ప్రతిఒక్కరికి అండగా నిలబడతానన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి తరపున పోరాటం చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవెర్చకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల కంటే ఎక్కువ పథకాలను అమలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయడం లేదన్నారు. తొలుత గ్రామాల వారీగా పార్టీ నాయకులు ప్రసంగించారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ముద్రగడ గిరిబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, యిజనగిరి ప్రసాద్, బీశెట్టి అప్పలరాజు, గుమ్ములూరి వెంకటరమణ, ఓలేటి చంటిబాబు, కొండబాబు, రమణమ్మ, అల్లం ఆదినారాయణ, మజ్జూరి సూర్యనారాయణ, నీరుకొండ అర్జునరావు, కాలారి సత్తిబాబు, రమేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం



తోట నరసింహం

కిర్లంపూడి: మండలంలోని వీరవరంలో శనివారం బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంపై మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం శుక్రవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని తోట నరసింహం పిలుపునిచ్చారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు.
ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ఉపాధ్యాయల రమేష్, దేవులపల్లి ప్రసాద్ చిట్టెం వాసు, వేణు, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 40 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యంలోనూ పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కాట్రావులపల్లిలో కార్డన్ సెర్చ్



కాట్రావులపల్లిలో మోటారు సైకిళ్లను సీజ్ చేస్తున్న సీఐ శ్రీనివాస్

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 13 మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. డ్రోన్ ద్వారా అసాంఘిక కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను పరిశీలించామని చెప్పారు. తనిఖీల్లో భాగంగా సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో గండేపల్లి ఎస్సై శివనాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జగ్గంపేటలోని మర్రిమొక్క వీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 15 వాహనాలకు జరిమానా విధించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర టీయూసీ ప్రధాన కార్యదర్శిగా ప్రభాకరరావు



ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర టీయూసీ ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన జల్లిగంపల ప్రభాకరరావు నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర టీయూసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రభాకరరావును ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు చిలకమర్తి సాయిప్రసాద్ తదితరులు అభినందించారు. కాగా తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుకు ప్రభాకరరావు కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేయాలి



ముక్కొల్లులో సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఓ రవికుమార్

కిర్లంపూడి: గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా శానిటేషన్ సిబ్బంది పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సూచించారు. మండలంలోని ముక్కొల్లు, వేలంక గ్రామాల్లోని పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లోని పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ అర్చకుడు సస్పెన్షన్

అన్నవరం: స్థానిక రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉప ప్రధానార్చకుడిగా పనిచేస్తున్న చిట్టెం వీఎస్ఎస్ హరగోపాల్, అదే ఆలయంలో సంభావన పరిచారకుడిగా పనిచేస్తున్న ఎస్ఎస్ సుబ్రహ్మణ్య కృష్ణ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గురువారం మధ్యాహ్నం కనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి రూ.26,500 విలువైన 45 కిలోల ఆవునెయ్యిను ఉప ప్రధానార్చకుడు హరగోపాల్ తన కారులో పట్టుకుపోయేందుకు ప్రయత్నించినట్టు, అతనికి సంభావన పరిచారకుడు సహకరించినట్టు అభియోగాలు వచ్చాయి. దీనిపై సీసీ టీవీ ఫుటేజీల ద్వారా విచారణ చేసి అభియోగాలు వాస్తవమేనని నిర్ధారించారు. దీనిపై వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని వారిని ఈఓ ఆదేశించారు.

రాజీ మార్గమే రాజమార్గం



తునిలో లాయర్లకు మధ్యవర్తిత్వం బ్రోచర్లను పంపిణీ చేస్తున్న జడ్జి గోపాలకృష్ణ

తుని: కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ అన్నారు. మీడియేషన్ ఫర్ ద నేషన్ వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను కక్షిదారులు, లాయర్లకు వివరించారు. అందుకు సంబంధించిన పోస్టర్లు, బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి గోపాలకృష్ణ మాట్లాడుతూ కేసు ప్రారంభ దశలోనే మధ్యవర్తిత్వానికి పంపించి ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించాలన్నారు. ఇరుపక్షాలు సమ్మతి తెలపకపోతే కేసు మళ్లీ ట్రెల్‌కు వెళుతుందన్నారు. సెప్టెంబర్ 30 వరకూ జరిగే మీడియేషన్ (రాజీ) డ్రైవ్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, శిక్షణ పొందిన మధ్యవర్తులు పాల్గొన్నారు.

గ్రావెల్ టిప్పర్లకు ప్రత్యేక రోడ్డు వేయాలి



శంఖవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న మేకల కృష్ణ

శంఖవరం: రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా కత్తిపూడి వేళ్లే భారీ టిప్పర్ల కోసం ప్రత్యేక రోడ్డు వేయాలని సామాజిక కార్యకర్త మేకల కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన స్వగ్రామం శంఖవరంలో విలేకరులతో మాట్లాడారు. నిత్యం వందలాది లారీలు నల్లబండరాళ్లు, ఎర్ర మట్టి (లేటరైట్), గ్రావెల్‌తో రాకపోకలు చేస్తున్నాయన్నారు. టిప్పర్లు అతివేగంగా వెళ్లడంతో దుమ్ము, ధూళి లేచి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. టిప్పర్ల రాకపోకల కారణంగా ప్రయాణికులు, పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 30 ఏళ్లుగా టిప్పర్లు తిరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లో యువత అడ్డు పడితే కేసులు పెడుతున్నారన్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్, అటవీ, రవాణ, పోలీస్ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఈ నెల 21 నుంచి 24 వరకు రిలే దీక్షలు చేపడతానన్నారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే 25న ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం ప్రయాణీకులకు మాస్కులు పంపిణీ చేశారు.

వయోవృద్ధుల సంక్షేమంపై కళాజాత



తుని రైల్వేస్టేషన్ వద్ద ప్రదర్శన ఇస్తున్న కళాజాత బృందం

తుని: స్థానిక రైల్వేస్టేషన్, గొల్లప్పారావు సెంటర్లలో మత్తు పదార్థాల నివారణ, వయోవృద్ధుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై శుక్రవారం సాయంత్రం కళాజాత నిర్వహించారు. వీర్నాల కృష్ణ ఆధ్వర్యంలో కళాజాత బృందం మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలు, కన్నబిడ్డలు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే ట్రిబ్యునల్ ద్వారా ప్రతీ నెలా భరణం కింద రూ.10 వేలు ఇచ్చే విధంగా తీసుకొచ్చిన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రామాల్లో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాలు

జగ్గంపేట: మండలంలో జె.కొత్తూరు, రాజపూడి, రామవరం గ్రామాల్లో శుక్రవారం విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాలు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. గ్రామ సర్పంచ్ చైర్‌పర్సన్‌గా, మహిళా పోలీసు కన్వీనర్‌గా 11 మంది సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశాల్లో బాలికల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

కిర్లంపూడి: రైతుల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా సొసైటీ చైర్మన్, సభ్యులు కృషి చేయాలని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. వీరవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) చైర్మన్‌గా తోట సతీష్ కుమార్(గాంధీ) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పార్టీ మండల ప్రెసిడెంట్ చదరం చంటిబాబు ఆధ్వర్యంలో జగపతినగరంలో ముందడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, తూము కుమార్, కాళ్ల వెంకటేశ్, ఎస్‌వీఎస్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తొండంగి: మండలంలోని కృష్ణాపురం నుంచి ఎల్లయ్యపేట వరకూ ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణానికి కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.3 కోట్లతో నిర్మించే అర్ అండ్ బి రహదారి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. అలాగే ఎల్లయ్యపేటలో రూ.40 లక్షలతో నిర్మించే మత్స్యకార కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇసుక విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు



కోటనందూరులో ఇసుక నిల్వ చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: అనుమతులు లేకుండా ఇసుక విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కోటనందూరుకు చెందిన ఓ వ్యక్తి స్థానిక చెరకు కాటా ప్రాంతంలో గోదావరి ఇసుక స్టాక్ వేసి విక్రయిస్తున్నాడు. తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తోందన్నారు. ఎవరైనా ఇసుకను నిల్వ చేసి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

క్యాన్సర్ బాధితురాలికి చేయూత



బోన్ క్యాన్సర్ బాధితురాలి తాతయ్యకు చెక్కు అందజేస్తున్న మణికర్ణిక టీం సభ్యులు

ప్రత్తిపాడు: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువతి వైద్య ఖర్చుల నిమిత్తం మణికర్ణిక టీం సభ్యులు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలోని ఏలూరు గ్రామానికి చెందిన దేవి (19) బోన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమెకు దాతల సహకారంతో చెన్నైలో చికిత్స జరుగుతోంది. మణికర్ణిక టీం సభ్యులు స్పందించి, దాతల నుంచి విరాళాల రూపంలో సేకరించిన రూ.20 వేల చెక్కును ఏలూరులో దేవి తాతయ్య సత్యంశెట్టి అమ్మన్నకు అందజేశారు. కార్యక్రమంలో మణికర్ణిక టీం ఉపాధ్యక్షుడు మొగలంక శ్రీను, సభ్యులు వీరబాబు, మణికంత, రమేష్, నాని, గని తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ గార్డెన్స్‌లో సినిమా షూటింగ్

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి శివారున ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణ గార్డెన్స్‌లో శుక్రవారం సినిమా షూటింగ్ చేశారు. మా రాముడు అందరివాడు సినిమాలో పలు కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మైఖేల్ దర్శకత్వంలో శ్రీరాం హీరోగా, అఖండ ఫేమ్ నాగమహేష్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో చిత్రానికి అవసరమైన కీలక సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించినట్టు చిత్ర యూనిట్ తెలిపింది. తాము షూటింగ్ చేసుకోవడానికి సహకరించిన ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

శాకంబరి నమోస్తుతే..

- కూరగాయలు, పండ్లతో అమ్మవార్లకు విశేష అలంకరణ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరం లక్ష్మీదేవి చెరువు గట్టుపై కొలువైన మరిడమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాకంబరిగా విజయదుర్గ అమ్మవారు

ప్రత్తిపాడు: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేంచేసిన విజయదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారిని సుమారు వెయ్యి కేజీల కూరగాయలు, పండ్లతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే స్థానిక వీరభద్రునిగడ్డలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా వేగులమ్మ జాతర



గుమ్మళ్లదొడ్డిలో అమ్మవారి బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

గోకవరం: మండలంలో గుమ్మళ్లదొడ్డి గ్రామదేవత వేగులమ్మ జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారి బోనాలను గ్రామంలో ఊరేగించారు. జాతర సందర్భంగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు 300 మంది మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేశారు. జాతర మహోత్సవానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, నాయకులు వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో శాకంబరిగా విజయదుర్గమ్మ



ఎస్.అన్నవరంలో మరిడమ్మతల్లి



గోకవరంలో దేవీచౌక్ కనకదుర్గమ్మ



వీరభద్రునిగడ్డలో అమ్మవారు